క్లుప్తంగా

రక్తదానంతో ప్రాణదానం



రక్తదాతలకు సర్టిఫికెట్లను అందిస్తున్న దృశ్యం

గుమ్మఘట్ట: రక్తదానం.. ప్రాణదానంతో సమానమని పీహెచ్‌సీ వైద్యుడు రమేష్, తహసీల్దార్ బ్రహ్మయ్య అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు, గర్భిణులు, బాలింతలు, తలసీమియా వ్యాధిగ్రస్తులు, కిడ్నీ బాధితులకు రక్తం అవసరమన్నారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి రక్తదాతలను ఫోన్‌ద్వారా అభినందించారు. అనంతరం రక్తదానం చేసిన 60 మంది రక్తదాతలకు అధికారులు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు రాంకిశోర్, బాలాజీనాయక్, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఈఓఆర్డీ సురేశ్‌బాబు, ఐఆర్‌సీఎస్ సభ్యుడు ఈరన్న, సీహెచ్‌ఓ మురళీధర్, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీటీపీ గోవిందు, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు టీ శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



హెమటోలజీ అనలైజర్‌ను చూపుతున్న ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్

కూడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. పీహెచ్‌సీలో మరిన్ని రక్త పరీక్షలు చేసేందుకు చొరవ చూపింది. గురువారం కూడేరు పీహెచ్‌సీలో హెమటోలజీ అనలైజర్‌ను అందుబాటులోకి ప్రభుత్వం తెచ్చింది. ఈ మిషన్ సుమారు రూ.లక్ష వరకు ఉంటుంది. ఈ యంత్రం ద్వారా రక్తంలో కణాల సంఖ్యను తెలుసుకోవచ్చని, ఎంసీహెచ్, టీసీ, డీసీ, హెచ్‌బీతో పాటు మరిన్ని పరీక్షలు ఇక్కడే చేసి రిపోర్టులు ఇస్తామని ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్ తెలిపారు. ఇలాంటి పరీక్షలు ప్రైవేటుగా చేయించుకుంటే సుమారు రూ.1,200 వరకూ ఖర్చవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ మిషన్ ఏర్పాటు చేయడం పట్ల మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

ముత్యాలపల్లకీలో ఊరేగిన వీరభద్రస్వామి



గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెర గ్రామంలో ఉన్న వీరభద్రస్వామిని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ముత్యాలపల్లకీలో గురువారం రాత్రి ఘనంగా ఊరేగించారు. మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. స్వామి ఉత్సవ విగ్రహాన్ని రంగురంగుల పుష్పాలతో అలంకరించిన ముత్యాలపల్లకిలో కొలువుదీర్చి మేళతాళాల నడుమ ఊరేగించగా భక్తులు ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయకమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బిందు సేద్యం పరికరాల పంపిణీ

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల పంచాయతీ పరిధిలోని ఐదు గ్రామాల్లో రెండు రోజులుగా ఆర్డీటీ 368మంది రైతులకు బిందు సేద్యం పరికరాలు అందజేసింది. ఆ పంచాయతీని ఆర్డీటీ వాటర్‌షెడ్డు గ్రామంగా తీసుకుని ఆరు నెలలుగా వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం తెలిసిందే. 90 శాతం సబ్సిడీతో చిన్న, సన్నకారు రైతులకు బిందుసేద్యం పరికరాలు అందజేసినట్లు ఆ సంస్థ ఎస్టీఓలు రామాంజనేయులు, వెంకటేష్ తెలిపారు. అలాగే 210 మంది రైతుల పొలాల్లో భూ అభివృద్ధి పనులు, 240మంది పాడి రైతులకు 60 శాతం సబ్సిడీతో పాడి గేదెలు అందించామన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం ప్యాకెట్లు చూపిస్తున్న ఎస్‌ఐ ఆంజనేయులు

బొమ్మనహాళ్: అక్రమంగా కర్ణాటక రాష్ట్రం నుంచి మద్యం ప్యాకెట్లు తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, 205 (90 ఎంఎల్) కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్న ఎస్‌ఐ ఆంజనేయులు గురువారం తెలిపారు. మండలంలోని గోనేహాళ్ గ్రామానికి చెందిన బోయ సిద్దప్ప ర్ణాటక రాష్ట్రం నుంచి మద్యం ప్యాకెట్లు తరలిస్తుండగా ఉప్పరహాళ్ క్రాస్ వద్ద అరెస్టు చేశామన్నారు. అతడి నుంచి మద్యం ప్యాకెట్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించామన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం



ఉరవకొండ: రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ



కూడేరు: బాధితులకు చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని, సీఎం సహకారంతో పట్టణాభివృద్ధే లక్ష్యంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ట్యాంకుల ఏర్పాటు పనులను చేపడుతున్నామ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. గురువారం స్థానిక గుంతకల్లు రోడ్డులోని గ్యాస్ గోడౌన్ ఎదుట నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. సర్పంచ్ లలితమ్మ, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు ఆధ్వర్యంలో రూ.30 లక్షల పంచాయతీ నిధులు, రూ.10 లక్షల ఎఫ్ఎఫ్‌సీ నిధులతో మాజీ ఎమ్మెల్యే విశ్వ పనులను ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే ఉరవకొండ పట్టణంలో జేజేఎం ద్వారా ఇంటింటికి కొళాయి పథకం 80 శాతం పూర్తి చేశామన్నారు. అలాగే కోట్లాది రూపాయల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప, ఎంపీటీసీలు అంగదాల గీత, కురుబ లక్ష్మిదేవి, కురుబ ప్రకాష్, జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి

కూడేరు: ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎం రిలీఫ్‌ఫండ్) పేదలకు అండగా నిలుస్తోందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని కడదరకుంటకు చెందిన మౌనిక, పి.నారాయణపురానికి చెందిన భరత్ కుమార్‌రెడ్డి అనారోగ్యంతో వివిధ ఆస్పత్రుల్లో వైద్యం పొందారు. వైద్య ఖర్చులకు వేలాది రూపాయలు ఖర్చు చేశారు. ఈ విషయం కుటుంబ సభ్యులు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి దృష్టికి తీసుకుపోయారు. ఆయన స్పందించి సీఎం సహాయ నిధి నుంచి మౌనికకు రూ.80 వేలు, భరత్‌కుమార్‌రెడ్డికి రూ.33 వేలు ఆర్థికసాయం అందేలా చేశారు. గురువారం అనంతపురంలోని తన స్వగృహంలో బాధితులకు మాజీ ఎమ్మెల్యే చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణరెడ్డి , మాజీ ఎంపీటీసీ సభ్యుడు రామాంజనేయులు, సచివాలయ కన్వీనర్లు మురళి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ



వెంకటనరసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ రంగయ్య, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

బెళుగుప్ప: మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటనరసు(48) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి తదితరులు మృతుడి ఇంటికి వెళ్లి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మృతుడి భార్య అరుణమ్మ, కుమారుడు రాజవర్ధన్, కుమార్తె లావణ్యతో మాట్లాడి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

సర్మస్ హుసేనీ్స దర్గాలో ఫాతేహాలు



అలంకరణలో సర్మస్ హుసేనీ్స స్వామి సమాధి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మస్ హుసేనీ్స స్వామి దర్గాలో గురువారం భక్తులు ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. స్వామి దర్శనార్థం ఆంధ్రా, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక ఫాతేహాలు, ప్రార్థనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గా ఆవరణలో కందూరీలు చేశారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు



రాయదుర్గంలో బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు



బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్‌లో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

రాయదుర్గం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడలు మూడోరోజు గురువారం రాయదుర్గం పట్టణంలోని వివిధ క్రీడా మైదానాల్లో ఉత్సాహంగా, ఉల్లాసంగా కొనసాగాయి. పట్టణంలోని 18 సచివాలయాల పరిధిలో ఇది వరకే వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులతో జట్లు ఏర్పాటు చేసి క్రీడలు నిర్వహిస్తున్నారు. గురువారం పోటీలను మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఎంఈఓ నాగమణి పర్యవేక్షించారు. సచివాలయ సిబ్బందికి, పీడీలకు తగిన సలహాలు, సూచనలు అందజేశారు.

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, గోవిందవాడ, దర్గాహొన్నూరు గ్రామాల్లో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడలను ఎంపీడీఓ షకీలాబేగం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్రకు శ్రీకారం చుట్టిందన్నారు.

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా 15 గ్రామ సచివాలయాల పరిధిలో జరిగిన వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, బాడ్మింటన్, ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచి పలువురు మండలస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి, ఈఓఆర్డీ సురేశ్ బాబు తెలిపారు. పోటీలను గురువారం వారు పర్యవేక్షించారు. కార్యక్రమంలో క్రీడాకారులు, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

థియేటర్‌లో కూల్‌డ్రింక్స్ దుకాణంపై కేసు



కేసు నమోదు చేస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారి శంకర్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కేబీ ప్యాలెస్ థియేటర్‌లో తినుబండారాలు, శీతల పానియాలు విక్రయిస్తున్న షాపులో ఎంఆర్‌పీ కంటే అధికంగా విక్రయిస్తుండడంతో గుంతకల్లు తూనికలు, కొలతల శాఖ అధికారి శంకర్ గురువారం రాత్రి ఆకస్మిక దాడుల నిర్వహించారు. అధిక ధరలపై వినియోగదారుల నుంచి ఫిర్యాదు రావడంతో తనిఖీ చేశామన్నారు. 200 ఎంఎల్ కూల్‌డ్రింక్ బాటిల్ కొనుగోలు చేయగా పది రూపాయలు విలువ ఉండగా రూ.30కు విక్రయించారన్నారు. నిర్నీత ధర కంటే అధికంగా ఎవరైనా వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మాలధారులకు అన్నదానం



అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో పంచాయతీరాజ్ విభాగం డీఈ వెంకటేసులు, అత్త అంజలి, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం అయ్యప్పస్వామి మాలధారులకు అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా అయ్యప్పస్వామి మూలవిరాట్‌కు పూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం అయ్యప్ప మాలధారుల ఆధ్వర్యంలో స్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు.

ఎరువులు, మందులు అందుబాటులో ఉంచండి



కణేకల్లు అగ్రికల్చర్ ఫారంలో వరి పంట కోతలను పరిశీలిస్తున్న డీఏఓ ఉమమహేశ్వరమ్మ

కణేకల్లు: రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు, మందులను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచాలని డీఏఓ ఉమమహేశ్వరమ్మ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం రాయదుర్గం నియోజకవర్గ వ్యవసాయశాఖ అధికారులు, ఎంపీఈఓ, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లతో డీఏఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలను ఆధారం చేసుకుని అవసరమైన మందులను ముందుగా గుర్తించి ఆర్బీకేల్లో ఉంచాలన్నారు. అలాగే ఆయా ప్రాంతాల్లో అవసరమైన మేరకు ఎరువులను కూడా సిద్ధంగా ఉంచాలని, రైతులెవరూ ఇబ్బందులు పడకూడదన్నారు. ప్రభుత్వం జనవరిలో పీఎం కిసాన్ సొమ్ము రైతుల ఖాతాలో జమా చేయనుందని ఈ లోపు పెండింగ్‌లో ఉన్న అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. నియోజకవర్గ వ్యాప్తంగా రబీ ఈ– క్రాప్ బుకింగ్ పూర్తిస్థాయిలో జరగలేదని అసంతృప్తి వ్యక్తం చేసిన డీఏఓ ఈనెల 31 లోపు పక్కాగా ఈ క్రాప్ బుకింగ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ మద్దిలేటి, రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్, టెక్నికల్ ఏఓ అహమ్మద్ బాషా, డి.హిరేహాళ్, కణేకల్లు, గుమ్మఘట్ట ఏఓలు మహేంద్ర, శ్రవణ్‌కుమార్, నిర్మల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కణేకల్లు అగ్రికల్చర్ ఫారంలోని పీడీడీఎఫ్ ఫారంలో నిర్వహించిన వరి పంట కోత ప్రయోగాలను డీఏఓ పరిశీలించారు. ఆత్మ పీడీ మద్దిలేటి, అగ్రికల్చర్ ఫాం ఏడీఏ నారాయణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతు అభ్యున్నతే వైఎస్సార్‌సీపీ అజెండా



ములకలేడులో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

శెట్టూరు: రైతుల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అజెండా అని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. గురువారం మండలంలోని ములకలేడు గ్రామంలో నూతంగా నిర్మంచిన 33/ 11కేవి విద్యుత్ ఉపకేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు అనంతరం విద్యుత్ కేంద్రంలోని పనులను పరిశీలించారు. ఇక్కడ నుంచి ఏఏ గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతుందన్న విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఇక్కడ నుంచి ములకలేడు, ముచ్చర్లపల్లి, కరిడిపల్లి, పెరుగుపాళ్యం గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. అనంతరం మంత్రి రైతులతో మాట్లాడుతూ పంటలకు అందుతున్న విద్యుత్ సరఫరా సంతృప్తింగా ఉందా లేదా అని అడిగారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో 24 గంటటూ విద్యుత్ సరఫరా ఉంటోందన్నారు. రైతులు సంతోషంగా ఉండాలన్నదే జగనన్న ఆశయమన్నారు. కార్యక్రమంలో ఎస్సీ ఆపరేషన్ సురేంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషాద్రి శేఖర్, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్ నాయుడు, ఏడీ మహేష్, ఏఈ జయకృష్ణ, మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్ తిమ్మరాజమ్మ, ఎంపీపీ లక్ష్మీదేవి, జెడ్పీటీసీ మంజునాథ, సచివాలయ కన్వీనర్ తిమ్మరాజు, మాజీ ఎంపీపీ రామభీమప్ప, మండల కన్వీనర్ శివన్న యాదవ్, మాజీ కన్వీనర్ సోమనాథ రెడ్డి, సర్పంచ్ నాగరాజు, నాయకులు హరినాథ రెడ్డి, రామకృష్ణ, బొమ్మజ్జి రమేష్, సుధాకర్ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, మహిళా నాయకులురాలు సంధ్యారాణి, నాగభూషణం, శీన, రాజన్న, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి



వికసిత్ భారత్ సంకల్ప యాత్ర క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నేమకల్లు గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభమైంది. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ దేశాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. నేమకల్లు గ్రామంలో కేంద్ర నిధులతో జరిగిన అభివృద్ధి పనులపై వివరించారు. అనంతరం క్యాలెండర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షకీలా బేగం, సర్పంచ్ పరమేశ్వర, ఈఓపీఆర్‌డీ విజయమ్మ, జేఈఈ జగదీష్, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఉండబండ'లో 3న వేలం

విడపనకల్లు: మండలంలోని ఉండబండ వీరభద్రస్వామి ఆలయంలో వివాహ తదితర శుభకార్యాలకు సప్లయర్స్ సామాన్లు, టెంకాయలు, పూజా సామగ్రి, పూలహారాలు, విడిపూలు ఒక సంవత్సరం పాటు విక్రయించడానికి జనవరి 3న దేవదాయశాఖ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ రమేష్‌బాబు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గలవారు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నాలన్నారు.

ఘనంగా అవ్వతాతల దినోత్సవం

కుందుర్పి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎస్కే చారిటబుల్ ట్రస్టు పర్యవేక్షణలో నిర్వహిస్తున్న విలువల బడుల్లో అవ్వతాతల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ట్రస్టు వ్యవస్థాపకుడు లెనిన్‌బాబు మాట్లాడుతూ అమ్మ, నాన్నలకు జన్మనిచ్చి, మన కుటుంబాల్లో వెలుగులు నింపిన వృద్ధులను అనాథాశ్రమాలకు వెళ్లే పరిస్థితి లేకుండా చూడాలన్నారు. వృద్ధాప్యంలో వారికి తోడ్పాటునివ్వాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్టు బాధ్యుడు రాజు, కోఆర్డినేటర్లు రఘువీరా, లక్ష్మణమూర్తి, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనం తనిఖీ చేస్తున్న పోలీసులు

వజ్రకరూరు: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం సాయంత్రం ఎస్‌ఐ నరేష్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాల తని ఖీ నిర్వహించారు. పోలీసులు మాట్లాడుతూ వాహన రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. అతివేగంతో వాహనాలు నడపరాదన్నారు. రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు.

కొళాయిలు ఏర్పాటు చేయాలి

కూడేరు: కొళాయిలు ఏర్పాటు చేసి తాగునీటి సమస్య లేకుండా చూడాలని కూడేరులోని సత్యసాయి కాలనీవాసులు గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఎంపీడీఓ ఎం కే బాషా, ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ మాట్లాడుతూ నెలన్నరలోపు పైపులైన్ ద్వారా కొళాయిలు ఏర్పాటు చర్యలు చేపడతామని చెప్పడంతో వారు వెనుదిరిగారు.

కనుల పండువగా షిరిడీసాయి పల్లకీ ఉత్సవం



అలంకరణలో షిరిడీసాయి

వజ్రకరూరు: మండల కేంద్రంలోని షిరిడీ సాయిఆలయంలో గురువారం సాయంత్రం పల్లకీ ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, అర్చనలు, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, హారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పల్లకీ ఉత్సవం నిర్వహించారు. రాత్రి శేజ్‌హారతి చేపట్టారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకుడు అనంతస్వామి, భక్తులు పాల్గొన్నారు.

ప్రశాంత జీవనం గడపాలి



కురువళ్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

బొమ్మనహాళ్: గ్రామీణుల ప్రశాంతత జీవనానికి ఎవరైనా భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ఆంజనేయులు హెచ్చరించారు. గురువారం సాయంత్రం మండలంలోని కురువళ్లి, చంద్రగిరి, సిద్దరాంపురం గ్రామాల్లో సిబ్బందితో కలసి ఆయన పర్యటించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ రౌడీయిజం, అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తే ఎంతటివారైనా సరే చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. బాల్య వివాహాలను ప్రోత్సహించినా, చేసినా బాధ్యులపై కేసుల నమోదు చేస్తామన్నారు. పిల్లలను పాఠశాలలకు పంపి విద్యావంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు.

'విద్యుత్ బిల్లులను కౌంటర్‌లో చెల్లించండి'

కణేకల్లు: కణేకల్లు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బిల్లుల వసూళ్లకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని, వినియోగదారులు అక్కడకు వచ్చి తమ బిల్లులను చెల్లించాలని ఆశాఖ ఏఈఈ శంకర్‌నాయక సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కరెంటు బిల్లుల చెల్లింపు కోసం ఎవరినీ ఆశ్రయించవద్దన్నారు. కార్యాలయంలో ఉన్న కౌంటర్‌కు వచ్చి బిల్లులను చెల్లించి రసీదులు పొందాలన్నారు. ఒక వేళ ఇక్కడికి రాలేకపోతే విద్యుత్‌శాఖ ఏర్పాటు చేసిన అధికారిక యాప్, గూగుల్ పే, ఫోన్ పే ద్వారా బిల్లులు చెల్లించాలన్నారు. గడువులోపు బిల్లులను చెల్లించకపోతే కరెంటు కనెక్షన్‌ను తొలగిస్తామని ఆయన హెచ్చరించారు.

పక్కాగా ఓటరు జాబితా

వజ్రకరూరు: ఓటరు జాబితా పక్కాగా ఉండాలని తహసీల్దార్ అనిల్‌కుమార్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బీఎల్‌ఓలతో తహసీల్దార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో కొత్త ఓటరు నమోదు, డెత్‌లు, పో లింగ్ స్టేషన్లు, అభ్యంతరాలు, నోటీసుల జారీ తదితర అంశాలపై చర్చించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఓటరు నమోదు, అభ్యంతరాల పరిశీలన తదితర అంశాలపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.